నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 10 జూలై 2024 | NALGONDA

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీస్ శిక్షణ దరఖాస్తులకు నేడు ఆఖరు

నల్లగొండ, జూలై 9 : 2024-25 సంవత్సరానికి షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ హైదరాబాద్‌లో నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఉచిత శిక్షణకు బుధవారంతో దరఖాస్తుల స్వీకరణ పూర్తి కానున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ నవీన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 మందిని రాత పరీక్షల ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ ఉతీర్ణులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను గత నెల 17 నుంచి దరఖాస్తుల స్వీకరణ చేస్తుండగా బుధవారంతో ముగియనుందని పేర్కొన్నారు. అర్హులైన వారు www.tsstudycircle.co.in ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఈ నెల 21న హైదరాబాద్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 040-23546552, 9396621492 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతితో కూడిన పది నెలల కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.



ఎస్సెల్బీసీ వైద్య కళాశాలలో ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ నారాయణ రెడ్డి

నల్లగొండ, జూలై 9 : నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్బీసీ వద్ద నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కళాశాల మొత్తం కలియ తిరుగుతూ కళాశాల నిర్మాణ ప్లాన్‌ను పరిశీలించారు. ఇంకా ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే ముందే సరి చేసుకోవాలని, కమ్యూనిటీ మెడిసిన్ సెంటర్‌లో అవసరమైన హాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్త భవనం నిర్మాణం ఆలస్యానికి గల కారణాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకోగా ఆయన ఇసుక వల్ల ఆలస్యమైందని తెలిపారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందించి భవన నిర్మాణానికి అవసరమైన ఇసుకను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, సాధ్యమైనంత త్వరగా భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని అన్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు టీజీఎంఐడీసీ అధికారులతో పాటు కాంట్రాక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి భవనాన్ని పూర్తి చేసి ఇస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నిత్యానంద్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి, ఆయా విభాగాల అధిపతులు తదితరులు ఉన్నారు.

లక్ష్యాన్ని బట్టి ప్రతి శాఖ మొక్కలు నాటాలి

వన మహోత్సవం కింద ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం మొక్కలు నాటాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వివిధ అంశాలపై మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షిస్తూ వన మహోత్సవం కింద నాటాల్సిన మొక్కలపై ఇదివరకే ఆయా శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించామని, మొక్కలు నాటడంతో పాటు, వాటిని సంరక్షించాలని తెలిపారు. నాటిన ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. బదిలీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తనిఖీలు నిర్వహించి నివేదికల సమర్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, పూర్ణచంద్ర, డీఆర్‌ఓ రాజ్యలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ కరణ్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, డీపీఓ మురళి, డీఎంహెచ్‌ఓ కళ్యాణ చక్రవర్తి, ఐసీడీఎస్ పీడీ సక్కుబాయి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యా 'అవస్థ'

బడులను పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు

ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం

- కనీస సదుపాయాలు లేక విద్యార్థుల ఇబ్బందులు
- నత్తనడకన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు
- ఉపాధ్యాయుల కొరత.. అనేక చోట్ల ఒక్కరిద్దరే..
- నిలిచిన మన ఊరు-మన బడి.. కాంట్రాక్టర్లు లబోదిబో
- సకాలంలో అందని మధ్యాహ్న భోజనం బిల్లులు

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాలికొదిలేసింది. నిరుపేదలు చదివే సర్కారు పాఠశాలలను పట్టించుకోవడమే మానేసింది. కనీసం సదుపాయాలు లేకపోవడంతో స్టూడెంట్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు నత్తనడకన సాగుతున్నాయి. పిల్లలున్నా టీచర్లు లేకపోవడంతో నాణ్యమైన విద్య దొరుకడంలేదు. ఇక మన ఊరు-మన బడి పథకాన్ని అటకెక్కించారు. మధ్యాహ్న భోజనం బిల్లులు సకాలంలో రావడం లేదు.

– రామగిరి, జూలై 9

నల్లగొండ పాత బస్తీలోని బాలికల ఉన్నత పాఠశాల

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు అంతంతే..

కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. దీని కింద టాయిలెట్లు, తాగునీరు, మైనర్, మేజర్, మరమ్మతులు, విద్యుత్ తదితర పనులు చేపట్టాలి. కానీ జిల్లాలో పనులు ముందుకు సాగడంలేదు. పాఠశాలు పునఃప్రారంభం నాటికే పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పటికీ పనులు మెల్లగా నడుస్తున్నాయి. 50శాతం పనులకే నిధులు ఇచ్చినట్లు తెలుస్తున్నది. అనేక చోట్ల పాత భవనాల్లోనే పాఠశాలలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

బిల్లులు కట్టకపోవడంతో కరెంట్ కట్

మరో వైపు పాఠశాలలకు ఉచిత విద్యుత్ కరెంట్ లేకపోవడంతో బిల్లు చెల్లించని స్థితిలో పాఠశాలలు ఉన్నాయి. దాంతో విద్యుత్ కట్ చేస్తుండటంతో అంధకారంలో పాఠశాలలుంటున్నాయి. మరో వైపు ఆన్‌లైన్ డిజిటల్ తరగతులు ప్రసారం చూడలేని స్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో నియోజకవర్గానికి ఒక్క పాఠశాల చొప్పున సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం షురూ చేయగా అది కొన్ని పాఠశాలల్లో కొనసాగుతున్నది. కానీ మెనూ పాటించడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క జత యూనిఫామ్ పంపిణీ..

జిల్లాలో విద్యార్థులకు రెండు జతలకు బదులు ప్రభుత్వం ఒక జత బట్టలు మాత్రమే ఇచ్చింది. ఇంకా ఒక జత బట్టలు రావాల్సి ఉంది. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీ, ఆదర్శ, అర్బన్ రెసిడెన్షియల్, గురుకుల రెసిడెన్షియల్, ట్రైబల్ రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని కుట్టేందుకు స్వయంసహాయక సంఘాలకు అందించారు. ఇంకా రెండో జత కుట్టే ప్రక్రియలోనే ఉన్నా యి. మరోవైపు మధ్యాహ్న భోజన బిల్లులు రెండు నెలలుగా అందడంలేదు. వారికి నెలవారీగా ఇచ్చే రూ.3వేల గౌరవ వేతనం కూడా ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నది. మధ్యా హ్న భోజన సరుకులకు పెట్టుబడి తెచ్చి పెట్టడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించాలని కార్మికులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

పిల్లలు సరే.. టీచర్లేరి..?

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల కొరత వేధిస్తున్నది. 12 మంది విద్యార్థులు ఉంటే ఒక టీచర్ ఉండాలి. 24కంటే ఎక్కువ మంది విద్యార్థులుంటే ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. కానీ చాలా స్కూళ్లలో సరిగ్గా టీచర్లు లేరు. అనేక పాఠశాలలు ఒక్కరు, ఇద్దరు ఉపాధ్యాయులతోనే నడుస్తున్నాయి. దాంతో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు అందరినీ ఒకే దగ్గర కూర్చోబెట్టి చదువు చెబుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇక హైస్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్లు లేరు. కొన్ని చోట్ల ఇంకా పోస్టింగులు ఇవ్వలేదు. దీంతో విద్యార్థుల నాణ్యమైన విద్య అందడంలేదు. ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని గొప్పలు చెప్పినా ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. ఉపాధ్యాయులు వచ్చే వరకు విద్యా వలంటీర్ల నియామకానికి ఇప్పటివరకు చర్యలు లేవు. దీంతో పలు పాఠశాలల్లో విద్యార్థులు చదువులు వెనుకబడే అవకాశం ఉన్నది. ఇక స్కూళ్లలో స్కావెంజర్లు లేరు. గ్రామ పంచాయతీ సిబ్బంది పనిచేస్తున్నా ఇష్టం ఉన్నప్పుడు వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టెక్స్ట్ బుక్స్ కూడా చాలా పాఠశాలల్లో పూర్తి స్థాయిలో రాలేదు. రెండో విడుత రావాల్సి ఉన్నది.

మన ఊరు-మన బడి బంద్

ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు - మన బడి కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. మరమ్మతులు, కొత్త నిర్మాణాలకు నిధులు విడుదల చేసి పనులు చేపట్టింది. వీటిల్లో చాలా వరకు పనులు పూర్తయ్యాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మన ఊరు-మన బడి పథకాన్ని అటకెక్కించింది. దీంతో పనులన్నీ ఎక్కడికక్కడ ఆగిపోయాయి. అంతే కాకుండా చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలేదు. దాంతో వారంతా అధికారుల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఉద్యోగాలు ఇవ్వరు.. వలంటీర్లను నియమించరు

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను నియమించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక చాలా మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపేందుకు ఇష్టపడడం లేదు. గతంలో విద్యా వలంటీర్ల ద్వారా గ్రామాల్లోని నిరుద్యోగుకు ఉద్యోగ అవకాశాలు కల్పించేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశంగా చర్యలు తీసుకోకపోవడంతో నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. గతంలో పని చేసిన వలంటీర్లు ఇతర పనులకు పోయే పరిస్థితి లేకుండా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యా వలంటీర్ల వ్యవస్థలను పునరుద్ధరించాలి.

- యలమద్ది అశోక్‌కుమార్, నిరుద్యోగి, సూర్యాపేట

స్కాలర్‌షిప్ విడుదల చేయకపోవడం విచారకరం

విద్యా సంవత్సరం ముగిసినా స్కాలర్‌షిప్‌లు ఇంకా విడుదల కాలేదు. పేద, మధ్య తరగతి వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు దోహదపడే స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల వేయాలి. ఇప్పటికే రెండో సంవత్సరం తరగతులు ప్రారంభమవ్వగా తల్లిదండ్రులకు ఫీజులు భారంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పింది. స్కాలర్‌షిప్‌లను చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలి.

-గుగులోతు శ్రీనివాస్‌నాయక్, అనంతగిరి

మధ్యాహ్నం భోజనం బిల్లు అందజేయాలి

బడిలో పిల్లలకు మధ్యాహ్నం భోజనంలో అవసరమైన కూరగాయలు, నిత్యావర సరుకులు మేమే కొనుగోలు చేస్తున్నాం. బిల్లులు నెలనెలా అందకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తున్నది. మాకు ప్రతి నెలా అందజేసే హెల్పర్ గౌరవ వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఇస్తే మాకు ఇబ్బందులు ఉండవు.

- కారింగ్ లక్ష్మమ్మ, ఎంపీపీఎస్ రేగట్టె, కనగల్ మండలం

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి. ఏడు నెలలుగా గౌరవ వేతనం అందడం లేదు. అప్పులు చేసి సరుకులను తేవాల్సి వస్తున్నది. నిత్యావసర బిల్లులు గత ఫిబ్రవరి నుంచి మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే బిల్లులు ప్రభుత్వానికి పంపి నిధులు విడుదలయ్యేలా చూడాలి. లేకుంటే మధ్యాహ్న భోజన కార్మికులందరితో ఉద్యమం తీవ్రతరం చేస్తాం.

-వట్టెపు సైదులు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘ మండల గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ, మేళ్లచెర్వు

అందరికీ అందజేశాం

జిల్లా విద్యాశాఖ నుంచి వచ్చిన 1 నుంచి 8వ తరగతి కుకింగ్ కాస్ట్ ఏప్రిల్ 2024 వరకు, కోడిగుడ్ల కాస్ట్ మార్చి 2024 వరకు అందచేశాం. గౌరవేతనం రూ.1,000 ఏప్రిల్ 2024 వరకు, రూ.2000 మార్చి 2024వరకు విడుదల చేశాం. కొంత మందికి డీటీఓ నుంచి అందాల్సినవి జమ కాలేదని తెలిసింది. తర్వలోనే అందుతాయి. జూన్ బిల్లు ప్రపోజల్స్ అందచేశాం.

- అరుంధతి, ఎంఈవో - నల్లగొండ

మాజీ ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, వేదికపై బీఆర్ఎస్ నాయకులు స్రవంతి, రవికుమార్

తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామరక్ష

- పార్టీ కార్యకర్తలు నిరుత్సాహ పడొద్దు
- అభివృద్ధి పనులు కొనసాగించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసనలు తప్పవు
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

గట్టుప్పల్/చండూరు, జూలై 9 : తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ శ్రీరామరక్ష అని, పార్టీ అధికారంలో లేనంత మాత్రాన కార్యకర్తలు నిరుత్సాహ పడొద్దని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. చండూరు మండల కేంద్రంలో మంగళవారం మాజీ ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలను శాలువాలు, జ్ఞాపకాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తూ, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటుందని, నిరుత్సాహానికి గురికావొద్దని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు బీఆర్ఎస్ ఎంతో కృషి చేసిందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి కోసం 572 కోట్ల రూపాయలను తీసుకొచ్చి అభివృద్ధి పనులను చేపడితే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో కమీషన్ల కోసం పనులు ఆపుతున్నారని విమర్శించారు. పది రోజుల్లో అభివృద్ధి పనులు మొదలు పెట్టకపోతే ధర్నాలు, నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతి రెడ్డి, మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, మాజీ ఎంపీపీ అవ్వారి గీతా శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్పర్సన్ గుర్రం మాధవీవెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, కొత్తపాటి సతీశ్, మాజీ ఎంపీటీసీలు గొరిగ సత్తయ్య, చెరుపల్లి భాస్కర్, కావలి మంగమ్మ ప్రసాద్, పెందుర్తి వెంకటమ్మ, మాజీ సర్పంచులు మెండు ద్రౌపత్త మ్మావెంకటరెడ్డి, ఇడెం రోజా, పంకెర్ల పద్మ, నాయకులు ఉజ్జిని అనిల్ రావు, మధుసూదన్ రావు, బొడ్డు సతీశ్, కూరపాటి సుదర్శన్ పాల్గొన్నారు.

పనులు పారదర్శకంగా ఉండాలి

- పిల్లలకు మెరుగైన విద్యా బోధన అందించాలి
- సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

కేసారంలో ప్రైమరీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట రూరల్, జూలై 9 : కేసారం ఫేస్ - 2 డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో సీసీ రోడ్లు, సంపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని కేసారం మొదటి, రెండో ఫేస్ డబుల్ బెడ్రూం ఇండ్లను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంప్, సీసీ రోడ్ల పనులు నాణ్యతతో ఉండాలని, పనులు వేగవంతం చేయాలని సూచించారు. డబుల్ బెడ్రూం ఇండ్లకు విద్యుత్ కనెక్షన్లను త్వరలో చేపట్టాలన్నారు. వాటర్ లైన్, శానిటరీ పనులు సక్రమంగా చేయకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కేసారంలోని ప్రైమరీ, సూర్యాపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తుంన్నందున పిల్లలకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు.

15, 16న గ్రూప్-2 గ్రాండ్ టెస్ట్

నల్లగొండ, జూలై 9 : తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్, నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టీజీపీఎస్సీ గ్రూప్-2 ఉచిత గ్రాండ్ టెస్టులకు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు https://tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ తీసుకోవాలని, దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు కూడా టీజీపీఎస్సీ ఓటీఆర్, గ్రూప్-2 దరఖాస్తుతో తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్, నల్లగొండకు హాజరుకావాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో రెండో గ్రాండ్ టెస్ట్, 22, 23న మూడో టెస్ట్, 30, 31న మూడో గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు టీజీ బీసీ స్టడీ సర్కిల్, నల్లగొండలో లేదా 08682-220007 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నర్సాపురంలో విషజ్వరాలు

- ఇంటికి ఇద్దరు అస్వస్థత
- మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది

దామరచర్ల, జూలై 9 : మండలంలోని నర్సాపురం తండా జ్వరాలతో మంచం పట్టింది. ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. పదిరోజులుగా గ్రామస్తులు జ్వరం, వంటి, కీళ్ల నొప్పులతో నడువలేని స్థితిలో ఇంటిపట్టునే ఉంటున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి రాలేదని, పనులకు పోకుండా జ్వరాలతోనే అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా ఆర్ఎంపీ వైద్యులు వద్దకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. అసలే కరువు పరిస్థితి, అందులో ఇంటిలో అందరికీ జ్వరాలు రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరాలు తగ్గినప్పటికీ కొందరికి కీళ్లనొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో మొత్తం 1,600 మంది జనాభా ఉంటే అందులో సగానికిపైగా జ్వరాల బారిన పడ్డారు. డ్రైనేజీలు సక్రమంగా లేక పోవడంతో దోమలు విపరీతంగా పెరిగాయి. కనీసం దోమల నివారణకు ఫాగింగ్ కూడా జరుపడం లేదు. బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదని తండావాసులు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు రెండు మూడు రోజులకు ఒకసారి రావడంతో వాటినే నిల్వ చేసి తాగాల్సి వస్తున్నది.

నర్సాపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

గ్రామస్తులకు రక్త పరీక్షలు

జ్వరాల బారిన పడిన నర్సాపురం తండాలో గత మూడు రోజులుగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. తండాలో జ్వరాలు అధికంగా ఉన్నాయని, పారిశుధ్యం లోపించడం వల్ల వైరల్ ఫీవర్స్ వస్తున్నాయని చెప్పారు. అందరికీ రక్త నమూనాలను తీసుకొని పరీక్షలు చేసి చికిత్స చేస్తున్నామని, జ్వరాలు అదుపులోకి వస్తున్నాయని తెలిపారు.

మెడికల్ క్యాంపులో చికిత్స తీసుకుంటున్న జ్వర బాధితులు

తండాలో డ్రైడే

నర్సాపురం తండాలో వైద్యసిబ్బంది మంగళవారం డ్రైడే పాటించారు. ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి నిల్వ ఉన్న నీటిని తొలగించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

బంధువునంటూ వరుస కలిసి భారీ మోసాలు

- ఫేక్ కాల్స్‌తో 10 మంది నుంచి డబ్బులు వసూళ్లు

మిర్యాలగూడ, జూలై 9 : 'మామయ్యా నేను మీ బంధువును.. నీకు అల్లుడున వుతా... ఆసుపత్రిలో అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయి. డబ్బులు పంపించు తిరిగి మళ్లీ ఇచ్చేస్తా' అంటూ అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నాడు ఓ కేటుగాడు. ఇలా ఒక్కరిని కాదు ఇద్దరిని కాదు ఏకంగా వందలాది మందికి ఫేక్ కాల్స్ చేస్తూ వారితో మాట్లాడి డబ్బులు మినీ బ్యాంక్ అకౌంట్‌లో, పెట్రోల్ బంక్‌లకు వేయించుకొని ఎక్కడా దొరుకకుండా జాగ్రత్తలు తీసుకుంటూ మోసాలకు పాల్పడుతున్నాడు. ఇలా మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఓ రియల్టర్ మోసగాడి మాటలను నమ్మి రూ.50 వేలు ఓ మినీ బ్యాంక్ ఏటీఎంకు పంపాడు. అంతటితో ఆగకుండా రూ.20 వేలు పంపాలని సదరు మోసగాడు కోరగా అనుమానం వచ్చిన బాధితుడు పూర్తి సమాచారం తెలుసుకొని ఫోన్ కట్ చేశాడు. తాను మోస పోయానని తెలుసుకున్న బాధితుడు మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయనకు వచ్చిన ఫోన్ కాల్ ఆధారంగా దర్యా ప్తు చేపట్టిన పోలీసులకు దిమ్మ తిరిగే కాల్ డేటా లభ్యమైనట్లు తెలిసింది. అతడి బారిన సుమారు 1500 మంది వరకు పడి ఉంటారని కాల్ డేటా ఆధారంగా తెలుస్తున్నది. ఆ కాల్ డేటా ఓ నంబర్‌కు ఫోన్ చేసిన పోలీసులకు గుంటూరుకు చెందిన బాధితుడు బోరున విలపిస్తూ తాను రూ.90 వేలు పంపానని చెప్పాడని పోలీసులు పేర్కొంటున్నారు. కాగా సదరు మోసగాడు దామరచర్ల మండలం కొండ్రపోల్ వద్ద గల మినీ ఏటీఎం వద్ద అనుమానిత వ్యక్తి తచ్చాడినట్లు సీసీ పుటేజీలో గుర్తించినట్లు సమాచారం. ఇప్పటికే మోసగాడిపై పలువురు బాధితులు సైబర్ క్రైం పోలీసులకు సైతం ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.

దామరచర్ల మండలం కొండ్రపోల్ వద్ద గల మినీ ఏటీఎం వద్ద సీసీ పుటేజీలో రికార్డ్ అయిన అనుమానితుడు

ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఫేక్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా డబ్బులు పంపాలని అడిగితే ఎవరూ స్పందించవద్దు. ఓటీపీ నంబర్లు, వ్యక్తిగత అకౌంట్‌ల వివరాలను తెలియని వ్యక్తులకు చెప్పవద్దు. ఎవరైనా మోసపోతే వెంటనే పోలీసులకు గానీ, సైబర్ క్రైమ్ పోలీసులకు గానీ ఫిర్యాదు చేయాలి.

-సుధాకర్, మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ